అప్పటికి నాలుగురోజులుగా 'ఓ తల్లి కథ' సినిమాకు తీసుకెళ్లమని జయ నన్ను అడుగుతోంది. సామాన్యంగా ఇల్లు కదలదామె. ఎంతో బాగుందని చూసి వచ్చిన వాళ్లెవరయినా చెబితే తప్ప సినిమాకు తీసుకెళ్లమని అడగదు. నా చాలీచాలని సంపాదన - జీవితంలోని అతి సాధారణమైన కోర్కెలకు కూడా ఆమెను దూరంగా వుంచుతుందేమోనని అప్పుడప్పుడూ నాకని పిస్తూంటుంది.

నిజానికి సినిమాకెళ్లడం నాకంత యిష్టం లేకపోయినా ఎప్పుడూ అంతలా అడగని జయ మాట కాదనలేక - ఆ రోజైనా ఆమె కోర్కె తీర్చాలని సాయంత్రం ఆఫీసునుంచి కొంచెం తొందరగా ఇల్లు చేరుకొని - జయనూ, మా ముగ్గురి పిల్లల్నీ ప్రయాణం చేశాను.

పావుగంటలో మేమంతా సిద్ధమై - మావీధి



# వృద్ధాప్యం నేరమా?

మలుపు తిరిగి మెయిన్‌రోడ్ మీది కొచ్చేసరికి అనంతరావు ఎదురుపడ్డాడు. వాడు నా రెండో అన్న కొడుకు. ఏదో టెక్నికల్ కోర్స్ పాసై ఉద్యోగాల వేటలో వున్నాడిప్పుడు. "ఇదేనా రావడం? అక్కడంతా బాగున్నారా?" అన్నాను పలకరింపుగా.

వాడు తలూపి, "ఎంప్లాయిమెంట్ కార్డు 'రెన్యువల్' కోసం మధ్యాహ్నామే వచ్చాను నేను. మీరంతా ఎక్కడికి బయల్దేరారు?" అన్నాడు నవ్వుతూ.

"ఓ తల్లి కథ సినిమాకెడుతున్నాం. నువ్వు కూడా రా!" అని అటుగా పోతున్న రెండు ఖాళీ రిక్షాలను ఆపుజేశాను. జయా, పిల్లలూ ఆనందంతో ఒక రిక్షాలో ఎక్కి కూర్చున్నారు. నేను మరో రిక్షాలోకి ఎక్కబోతూంటే... "మామ్మ నొక్కదాన్నీ ఇంట్లో వదిలేశారా చిన్నాన్నా?" అన్నాడు హఠాత్తుగా అనంతరావు.

వాడి మాటలు నాకేం అర్థంకాలేదు. "ఏమిటి నువ్వనేది? మామ్మ మీ యింటి దగ్గరే వుంది కదా?" అన్నాను రిక్షాలో పెట్టిన కాలు బయటకు తీసి అయోమయంగా వాడ్ని చూస్తూ.

"మామ్మ అక్కడ వుండటమేమిటి? నిన్న యిక్కడకు వచ్చేసినట్టు అమ్మ నాతో చెప్పింది!" అన్నాడు ఆశ్చర్యంతో వాడు.

నా గుండెలు ఝల్లుమన్నాయి, "మామ్మ మీ యింటికి వచ్చి మూడు వారాలేగదరా అయింది... అయినా మీరెవరూ తోడు లేకుండా మామ్మ ఇక్కడికెలా వస్తుంది? ఇంతకీ అసలేం జరిగింది??" అన్నాను ఆందోళనగా. మా మాటలు వింటున్న జయ, పిల్లలూ రిక్షా దిగిపోయారు. సణుక్కుంటూ వెళ్లిపోయారు రిక్షావాళ్లు.

"జరిగిందేమిటో నాకూ తెలియదు. నిన్న ఉదయం బయటకు వెళ్లి – మధ్యాహ్నాం ఇంటి కొచ్చేసరికి మామ్మ కనిపించలేదు నాకు. అమ్మనడిగితే మీ దగ్గరకు వెళ్లిపోయినట్టు చెప్పింది. ఎవరినైనా తోడిచ్చి పంపిందేమోనని నేననుకున్నాను" అన్నాడు కంగారుపడుతూ అనంతరావు.

వాడు చెప్పింది విన్న మరుక్షణం నుంచీ నా మనసు మనసులో లేదు. ఏదో కీడు జరిగిందన్న భావన నన్ను వెన్నుతట్టి హెచ్చరిస్తోంది. స్తబ్దులై నిలుచున్న జయనూ, పిల్లల్నీ జాలిగా చూసి సినిమా ప్రోగ్రాం కాన్సిల్ చేసుకొని ఇంటికి తిరిగి వచ్చాం. ఈ విషయం వాళ్లింటి దగ్గర చెప్పడానికి అనంతరావు వెంటనే వెళ్లిపోయాడు. ఏం చెయ్యాలో తెలియని అయోమయావస్థలో పడిపోయాను నేను. ఎడతెగని ఆలోచనలు ఒక్కసారిగా ముసురుకొని నన్ను ఉక్కిరిబిక్కిరి చేసివేస్తున్నాయి. అమ్మ మామూలు స్థితిలో వుండివుంటే నేనింత హైరాన పడవలసిన అవసరం లేకపోను. పెద్దన్నయ్య చనిపోయినప్పట్నుంచీ ఆమెకు కొంచెం మతిస్థిమితం లేదు...

**లక్ష్మీ శ్రీనివాసన్**

**పాతబంగారం**

అమ్మకు నేనే ఆఖరివాణ్ణి. మా చిన్నతనంలోనే మరో స్త్రీ ఆకర్షణలో పడి మా తండ్రి మమ్మల్ని వదిలి ఆమెను తీసుకొని ఎక్కడికో వెళ్లిపోయాడు. అసలున్నాడో - చచ్చాడో ఈ నాటికీ తెలియదు. ఆ దౌర్భాగ్యుడు తను పోతూ మమ్మల్ని తప్ప అమ్మకేం మిగల్చలేదు. అప్పట్నుంచీ అమ్మ పడరాని కష్టాలుపడి మమ్మల్ని పెంచి - మా జీవితాల్ని ఓ కొలిక్కి తీసుకొచ్చింది. తల్లికి చిన్నకొడుకంటే అమితమైన ప్రేమ వుంటుందని పెద్దల వాక్కు. చిన్నకొడుకునైన నా మీద అమ్మకు ప్రేమలేదని చెప్పలేను గాని - అమ్మకు మాత్రం పెద్దకొడుకంటే అంతులేని ప్రేమ వుండేది. చిన్నతనంలోనే చదువుకు స్వస్తి చెప్పి కూలీ, నాలీ చేస్తూ కొంతలో కొంత అమ్మకు సాయపడేవాడు అన్నయ్య. అలాగే తలదాచుకునేందుకు చిన్న యిల్లు కూడా అమర్చగలిగింది అమ్మ.

విసుగూ, విరామం లేకుండా నిరంతరం తిరిగిపోయే కాలచక్ర ప్రభావంతో, అపూర్వమైన అమ్మ ప్రేమానురాగాలతో మేము పెద్దవాళ్లమయ్యాం. అందరికీ పెళ్లిళ్లై - ఎవరికి వారు వేరుపడి, పిల్లలు పుట్టినా - అమ్మ మాత్రం అన్నయ్య దగ్గరే వుండేది. పెద్దన్నయ్య బ్రతికి వుంటే అసలీరోజున ఈ సమస్య ఉత్పన్నమై వుండేది కాదు. కేన్సరు వ్యాధికి గురైన వదినకు - ఆమె ఆరోగ్యం కోసం ఎంతో డబ్బు ఖర్చు చేస్తూ తన నలుగురి పిల్లలతో బాటు అమ్మనూ తనే చూసేవాడు అన్నయ్య. తను బ్రతికున్నంత కాలం "మీరు అమ్మను చూడ్డంలేదురా" అని ఎన్నడూ ఒక్కమాట అని ఎరగడు. పైగా "అమ్మను ఈ ఇంటి గడప దాటనివ్వను. మీ బ్రతుకు లేవో మీరు బ్రతకండి. ఎప్పటికైనా నా చేతుల మీదుగానే అమ్మను బూడిద చెయ్యాలి" అనేవాడు అన్నయ్య.

## పాతబంగారం


*'లక్ష్మీశ్రీనివాసన్' అనే కలంపేరుతో వ్రాయబడిన 'వృద్ధాప్యం నేరమా?' అనే ఈ కథ 1984 లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించబడింది.*

*'లక్ష్మీశ్రీనివాసన్', 'లక్ష్మీశ్రీనివాస్' 'నాగశ్రీనివాసరావు' అనే కలం పేర్లతో 'శ్రీ చోడిశెట్టి శ్రీనివాసరావు' తెలుగు పాఠకులకు చిరపరిచితులు. వీరు 1944 - జూలై 1న ఉప్పాడ కొత్తపల్లిలో జన్మించారు. వివిధ పత్రికలు నిర్వహించిన పోటీలలో వీరి అనేక కథలు బహుమతులు పొందాయి. కొన్ని కథలు ఇంగ్లీష్‌లోకి అనువదించబడ్డాయి. వీరు రేడియో నాటికలు కూడా వ్రాసారు.*

*దాదాపు 25 సంవత్సరాల క్రితం వ్రాయబడిన 'వృద్ధాప్యం నేరమా?' అనే ఈ కథ నేటి సామాజిక పరిస్థితులకు సైతం దర్పణం పడుతోంది. ప్రతి వ్యక్తికీ వార్ధక్యం అనివార్య స్థితి అనే ఆలోచన లేకుండా మానవులు వృద్ధులను చిన్నచూపు చూడడం, నిర్లక్ష్యం చేయడం నేటికీ జరుగుతున్నదే. ఇదే ఇతి వృత్తంతో వ్రాయబడిన ఈ కథ మనస్సులకు హత్తుకోవడమే కాక, వృద్ధుల పట్ల మనుషుల ఆలోచనా ధోరణిని మార్చడం కోసం తప్పక ఉపయోగపడుతుందని ఆశించవచ్చు.*

*ఈ కథను 'కథాకేళి' పాఠకుల కోసం 'పాత బంగారం' శీర్షికన పునర్ముద్రిస్తున్నాం.*

అలాంటి మనిషి వదిన క్యాన్సరుకు బలి కావడంతో - పిచ్చివాడై ఆమె మీది ప్రేమను చంపుకోలేక - వదిన పోయిన నాలుగు నెలలకే తనూ జీవితయాత్ర ముగించాడు. తననెంతో ప్రేమగా చూసుకునే కొడుకూ, కోడలూ చనిపోవడంతో అమ్మ మనస్సు తీవ్రంగా గాయపడింది. ఆ గాయానికి మందులు వాడినా




ఫలితం శూన్యమైంది...

అప్పట్నుంచీ అమ్మ అదే ధ్యాసతో కృంగిపోయింది. చెట్టంత మనిషి తన కళ్లెదురుగా గుప్పెడు బూడిదైపోవటం ఆమెకు భరించ శక్యంగానిదైపోయింది. ఎప్పుడూ శూన్యంలోకి చూస్తూ వుండిపోయేది. పిలవగా పిలవగా పలకడం, పరీక్షగా చూస్తే తప్ప ఎదుటివాళ్లను పోల్చలేకపోవడం - ఒంటి మీద బట్ట వుందో లేదోనన్న గ్రహింపును కోల్పోవడం - ఇలాంటి మతిస్థిమితంలేని లక్షణాలు అమ్మను ఆవరించుకున్నాయి.

అలాంటి స్థితిలో అమ్మను చూడాల్సిన బాధ్యత మా ఇద్దరి మీదా పడింది. మా బ్రతుకులు మాకే భారంగా వున్న పరిస్థితులు... పెద్దన్నయ్యలా అమ్మను ఒకరి వద్దనే వుంచుకునేందుకు సహకరించలేదు. ఆనాటి నుండీ అమ్మ మా ఇద్దరి వద్దా చెరో నెలా వుంటోంది. నెల పూర్తికాగానే మా వాడితో అమ్మను అన్నయ్య దగ్గరకు పంపించడం - అలాగే అక్కడ్నుంచి ఎవరోఒకరు మా వద్దకు తీసుకొచ్చి దిగబెట్టడం జరుగుతోంది.

అమ్మకు మతి సరిగ్గాలేని కారణంగా ఇలా చెయ్యాల్సి వస్తోంది. ఆమె బాగున్న రోజుల్లో ఒంటరిగానే ఎక్కడికైనా వెళ్లి వచ్చేది. ఇప్పుడు బస్సెక్కి వెళ్లవలసిన ఊరు పేరు చెప్పడం కూడా అమ్మకు తెలియకుండా పోయింది. ఇవన్నీ వదినకు తెలియని సంగతులు కావు. తెలిసీ వదిన ఎందుకిలా చేసింది? అక్కడ బస్సెక్కితే మా వూరు రావడానికి గంటన్నర కంటే ఎక్కువ సమయం పట్టదు. అలాంటిది నిన్న ఉదయం బయలుదేరిన అమ్మ ఏమైంది? ఎక్కడకు వెళ్లిపోయింది??...

అంతులేని ఆలోచనల మధ్య కారుచీకట్లో కాంతిరేఖలా నాలో తళుక్కున చిన్న మెరుపు మెరిసింది. జయతో చెప్పి అప్పటికప్పుడు మా వూరు బయలుదేరాను. అక్కడ మేమెవరం లేకపోయినా - పెద్దన్నయ్య పిల్లలూ, ఎన్నో ఏళ్ల పాటు మాకు నీడనిచ్చిన యిల్లూ వున్నాయి.

పిల్లలమీదా, ఆ యింటిమీదా అమ్మకు అంతు లేని మమకారమని నాకు తెలుసు. ఎంత స్థిమితం లేకపోయినా "ఆ యిల్లు వాళ్ల కొంది లేయండిరా" అని అమ్మ అప్పుడప్పుడూ అనేది. తప్పనిసరిగా అమ్మ అక్కడికి వెళ్లుంటుందన్న నమ్మకంతో – రెండు గంటల తర్వాత వూళ్లో బస్‌దిగి – ఇంట్లోకి అడుగుపెట్టాను. నిమిషం తర్వాత నా నమ్మకం నీరుకారిపోయింది. మామ్మ కనిపించడం లేదన్న సంగతి తెలియ గానే వాళ్లంతా కంగారుపడ్డారు. ఆ చుట్టుపక్కల వెతకమని వాళ్లకు చెప్పి – అక్కడనుండి మా చిన్నన్నయ్య వూరు చేరుకున్నాను. నేను వెళ్లే సరికి అనంతరావు తమ్ముడు ఆరేళ్ల బుచ్చిబాబు అన్నం తింటున్నాడు. మిగిలిన వాళ్ల జాడ లేదు.

"మీ నాన్నా, అన్నయ్యా ఏరి?" వాణ్ణి అడి గాను.

"ఇంకా ఇంటికి రాలేదు" అన్నాడు బుచ్చి బాబు.

"మరి మామ్మేదిరా బుచ్చీ?" అనుకోకుండా ఆ ప్రశ్న నా నోటినుంచి వెలువడింది.

"కోపగించి మీ యింటికొచ్చేసిందట కాదే టీ" అన్నాడు నోరు సాగదీసుకొని బుచ్చి.

"ఎందుకు కోపగించిందిరా బుచ్చీ?" బుజ్జ గింపుగా అడిగాను.

"మామ్మకు విరేచనాలవుతూంటే – బట్టలు పాడవుతున్నాయని అమ్మ కోపంగా మాట్లా డింది. మామ్మేదో అంటే అమ్మ కర్ర తీసుకొని మామ్మ వీపుమీద కొట్టింది. మామ్మ ఏడుస్తూ సంచి తీసుకొని వెళ్లిపోయింది..." వాడింకా ఏదో చెబుతున్నా ఆ మాటలు నాకు వినిపించ లేదు. 'ఎంత దారుణం? అమ్మనలా బాధపెట్ట డానికి వదినకు చేతులెలా వచ్చాయ్?' బాధతో నా మనస్సు విలవిల్లాడింది. నా కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. ఆ మరుక్షణమే కోపంతో నా నరాలు వుప్పొంగాయి... సరిగ్గా అప్పుడే వదిన లోపలికొచ్చి "అత్తయ్య కనిపించారా మధూ?" అంది నన్ను చూస్తూనే.

నా ఒళ్లు మండిపోయింది. "కనిపించారు... ఆ శుభవార్త చెప్పడానికే వచ్చాను" అన్నాను అతి కష్టంమీద కోపాన్ని నిగ్రహించుకుంటూ.

వదిన తెల్లబోయి – మరుక్షణం నా మాట ల్లోని వ్యంగ్యాన్ని గ్రహించి తనూ నా వైపు తీవ్రంగా చూసింది.

"అమ్మకు మతిలేదనీ – వెంట మనిషినిచ్చి పంపాలనీ నీకు తెలియదా?" అన్నాను.

"తెలుసుబాబూ... ఎందుకు తెలియదు? పంపడానికి వారంరోజులు గడువుంచని కూడా తెలుసు. మేము తినో తినకో ఆవిడకు పెడుతు న్నాము. తిన్న దగ్గర్నుంచీ బట్టలు పాడుచేసు కుంటూంటే ఎలా ఓర్చుకొనేది? ఓర్చుకోలేక నిన్న చిరాకు పడ్డాను. అంతే... ఆవిడకు రోషం పొడుచుకొచ్చి నీ దగ్గరకు వెళ్లిపోతానని పట్టు బట్టి కూర్చున్నారు. ఎంత చెప్పినా వినిపించు కోలేదు. మీ అన్నయ్యేమో చేస్తున్న వ్యాపారం స్థిరం లేదని – ఆ గొడవలో పడి తిరుగుతు న్నారు. సమయానికి ఇంట్లో ఎవరూ లేరు... నా దగ్గర నాలుగురూపాయలుంటే యిచ్చి పంపించాను" అంది తేలిగ్గా.

వదిన నిజం చెప్పడంలేదన్న విషయం నాకు స్పష్టమైంది. ఒంట్లో బాగుండని మనిషిని నిర్దాక్షిణ్యంగా కొట్టి – వెళ్లిపోతూంటే చూస్తూ వూరుకున్న వదిన అసలు వుద్దేశ్యమేమిటో నాకర్థమైంది.

అంతలోనే అన్నయ్య వచ్చాడు. జరిగిన సంగతి తెలియగానే అన్నయ్య మొహం కోపం

తో జేవురించింది. నోటికొచ్చినట్టు వదినను తిట్టిపోశాడు. ఆవిడెందుకో ఏడుపు మొదలు పెట్టింది. చెయ్యవలసింది చేసి - ఏమీ ఎరగనట్టు ఏడవడం కొందరాడవాళ్ల లక్షణం! అంతటితో ఆగకుండా "అత్తగారు ఏమైపోయారో! ముసలిదాన్ని ఇంట్లోంచి వెళ్లగొట్టానని అందరూ నన్నాడిపోసుకుంటారు..." అంటూ ఏడుపు స్థాయిని మరింత పెంచింది.

ఆపుకోలేని కోపంతో అన్నయ్య వదిన మీదికి చెయ్యెత్తాడు - ఆ చేతిని పట్టుకొని, అన్నయ్యను శాంతింపజేసి "ఇప్పుడు ఆవేశపడి చెయ్యగలిగింది లేదు. అమ్మ కనిపించకపోతే తెలిసినవాళ్లంతా మనల్ని దుమ్మెత్తిపోస్తారు. దున్నపోతుల్లా యిద్దరుండి కాటికి కాళ్లు చాచుకున్న ముసలిదాన్ని కాలం తీరేవరకూ చూడలేకపోయారని చెవులు కొరుక్కుంటారు. అందుచేత ఆవేశం కట్టిపెట్టి ఏం చెయ్యాలో ఆలోచించు!" అన్నాను.

"అమ్మ వెళతానంటే మామూలుగా మనిషిని తోడిచ్చి పంపిందనే నేననుకుంటున్నాను మధూ! ఇలా జరిగిందని నాకింత వరకూ తెలియదు. ఇప్పుడేం చేద్దామంటావ్?" అని నన్నే ప్రశ్నిస్తూ అన్నయ్యా దిగాలుపడి కూర్చుండిపోయాడు.

నేనేం మాట్లాడలేదు. మా మధ్య కొద్దిసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది. అప్పటికి రాత్రి పది దాటిపోయింది. సమయం గడుస్తూందేగానీ ఏం చెయ్యాలో నాకూ తోచడంలేదు. ఏది చెయ్యడానికైనా అమ్మ ఫొటో కూడా మా దగ్గర లేదు. వూరూరూ తిరిగి గాలించడం తప్ప మరో గత్యంతరం లేదనిపిస్తోంది. గోటితో పోయేదానికి గొడ్డలి వరకూ పోవడం అంటే ఏమిటో ఆ క్షణాన నాకు తెలిసొచ్చింది.

దగ్గరగా మూసివున్న వీధి తలుపు తెరుచుకొని హడావిడిగా అనంతరావు లోపలికొచ్చాడు, "మామ్మ రాజమండ్రి బస్సెక్కడం నిన్న రిక్షా వీరయ్య చూశాడట" అన్నాడు.

ఆ మాట వినడంతోనే అమ్మ రాజమండ్రి వరకూ వచ్చి - మా ఇంటికి చేరుకోలేకపోయిందేమోనన్న అనుమానం నాలో కలిగింది. అమ్మ రాజమండ్రిలోనే ఎక్కడోచోట కనిపిస్తుందన్న నమ్మకం నాలో చోటు చేసుకొంది. ఈ ఆలోచన కలిగిన మరుక్షణం ఇక అక్కడ నిలవాలనిపించ లేదు, "ఇక్కడ నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. మేము రాజమండ్రిలో ఎంక్వయిరీ చేస్తాం" అని అన్నయ్యకు చెప్పి - అనంతరావుతోబాటు రోడ్డు మీదికొచ్చాను. ఆ సమయంలో బస్సులు అరుదుగా వస్తూ - పోతూంటాయి. బస్ కోసం నిరీక్షించి లాభం లేదని అటుగా వస్తూన్న ఓ లారీ ఆపుజేసి ఎక్కి కూర్చున్నాం. సుమారు గంటన్నర తర్వాత బస్ స్టేషన్ సమీపంలో మమ్మల్ని దింపి వెళ్లిపోయింది లారీ. ముందుగా బస్‌స్టేషన్ దగ్గర్నుంచే వెతకడం ప్రారంభించాం...

సరిగ్గా అప్పుడే కుటుంబ సమేతంగా సినిమా చూసి వస్తున్న రాంబాబు మేస్టారు కనిపించారు. ఆయన మా ప్రక్క వీధిలోనే వుంటున్నారు. మా కిరణ్‌కు ఆయనే ప్రైవేటు చెబుతుంటారు - "ఏద్దైనా వూరెళ్లి వస్తున్నావా?" అన్నారు నన్ను చూస్తూనే. అమ్మ సంగతి ఆయనకు చెప్పాను. విని చాలా నొచ్చుకున్నారాయన...

"ఎందుకా ముసలామెతో అలా ఫుట్‌బాల్ ఆడుతున్నారు! ఎవరు చూస్తే ఏంపోయింది చెప్పు? ఆవిడేం పట్టుచీరలూ, పంచదార అరిశెలూ, పౌడరూ, స్నోలూ అడుగుతుందా ఏమిటి? వేళకు గుప్పెడన్నమే కదయ్యా మీరు పెట్టేది. సరే, జరిగిపోయాక అనుకొని ఏం

లాభం? ముందు పని చూడండి" అంటూ నా మొహం వాచేలా చివాట్లు పెట్టి వెళ్లిపోయా రాయన.

నేను అనుకున్నంతా అయింది. వదిన తొందరపాటు వల్ల ఇంకా ఎందరు ఎన్ని రకాలుగా అంటారోనన్న భయం ఆ క్షణాన నాలో కలిగింది. మాస్టారన్నట్టు చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టయింది మా పని. ఆ చుట్టుపక్క ప్రాంతాలన్నీ ఉదయం పదిగంటల వరకూ గాలించినా అమ్మ కనిపించలేదు. ఇక అమ్మ కనిపించదేమోనన్న నిరాశ నా నవనా డుల్నీ కృంగదీస్తోంది. నీరసం, నిస్సత్తువ నన్నా వరించుకున్నాయి. అనంతరావుని వాళ్ల వూరెళ్ల మని చెప్పి నేను యింటికి వచ్చాను.


"అత్తయ్య ఎక్కడున్నారు?" ఆత్రంగా అడి గింది జయ.

జరిగింది ఆమెతో చెప్పాను. ఆమె బలవం తం మీద నాలుగు ముద్దలు తిని, మా కిరణ్‌ని వెంటబెట్టుకొని మళ్లీ అమ్మకోసం అన్వేషణ మొదలుపెట్టాను.

రాత్రి ఒంటిగంట వరకూ తిరిగినా ఫలితం దక్కలేదు. విపరీతంగా అలసిపోయిన శరీరం విశ్రాంతిని కోరుతోంది. తిరుగుముఖంపట్టి రైల్వేస్టేషను దగ్గర కొచ్చేసరికి - రైలు కిందపడి ఎవరో చచ్చిపోయారని చెప్పుకుంటున్నారక్కడ. ఆ మాట వినడంతోనే భయాందోళనలతో నా శరీరం వణికిపోయింది. శిలలా అలాగే నిల బడిపోయాను. కొన్ని క్షణాల అనంతరం తేరు కొని "ఎవరూ, ఏమిట"ని విచారిస్తే - చచ్చిపో యిందొక వృద్ధుడనీ, అతడికి నలుగురు కొడు కులనీ తెలిసింది. నలుగురు కొడుకులున్న ఆ ముసలివాడికి ఇలాంటి చావు రావాల్సింది కా దని అక్కడంతా అనుకుంటూంటే - సిగ్గుతో కుచించుకుపోతూ యిల్లు చేరుకున్నాను. కిరణ్ పడుకున్నాడు వచ్చిన వెంటనే అలసటతో.

నేను కూడా పడుకున్నానన్నమాటేగాని నాలో దుఃఖం ఆగడం లేదు. అమ్మ రూపం కళ్లముందు నిల్చి నన్ను వెక్కిరిస్తోంది... 'వెధవ ల్లారా... కళ్లెదురుగా వున్నంతసేపు నన్ను వంతులేసుకొని నానా హింసా పెట్టారు. కనిపిం చకుండా పోతే ఎందుకురా ఏడుస్తారు?' అని అమ్మ నన్ను నిలేసి ప్రశ్నిస్తున్నట్టనిపించింది... ఎటూ తోచని స్థితిలో - యెనలేని దుఃఖంతో కొట్టుమిట్టాడుతున్న నా సమీపానికి జయ వచ్చింది. సుమారు ఏడెనిమిది నెలలుగా ఓ క్రమపద్ధతిలో జరుగుతూ వస్తున్నది - అందు కు భిన్నంగా ఇలా ఎందుకు జరగాలి? అప్పటి కప్పుడు ప్రయాణమై అత్తయ్య వచ్చేస్తూంటే చూస్తూ మీ వదినెలా వూరుకొంది? ఈ అనర్థా నికి, మన అందరికీ మనశ్శాంతి లేకుండా పోవడానికి కారణం ఆవిడే. ఆవిడకు యిష్టం లేకపోతే ఇక్కడకు తీసుకొచ్చి దిగబెట్టాల్సింది. లేకుంటే ఉత్తరమైనా వ్రాసి వుండాల్సింది. ఇప్పు డు మనిషి కనిపించకుండా పోయారంటే ఎంత అప్రదిష్టో చూడండి!" అంది కళ్లనీళ్లు పెట్టుకొని జయ.

జయ మాటలు నాలో మరింత మనః క్లేశాన్ని కలిగించాయి. ఆమె అన్నదాంట్లో చాలా మటుకు నిజం దాగివుంది. నిన్నటికి నిన్నే గాక ఇంతకుముందు కూడా వదిన అమ్మను శారీరకంగా హింసించి వుంటుంది. మతిస్థి మితం లేనంతలో మనిషి కోపం చచ్చిపోదు. ఇదివరలో నాలుగైదుసార్లు 'మధూ, నేనిక అక్కడకు వెళ్లనురా - నీ దగ్గరే వుండిపోతాను' అన్న అమ్మమాటలు ఆకస్మికంగా నాకు జ్ఞప్తి కొచ్చాయి. ఆ మాటలకర్థం నాకిప్పుడు బోధ పడింది. బోధపడినా బాధపడినా ఇప్పుడు




అమ్మ లేదు - కనిపించడం లేదు... కనిపిస్తూ కళ్లెదుట వున్నన్నాళ్లు - నేను ఒక్కడ్నే ఎందుకు చూడాలన్న స్వార్థం నా కళ్లు మూసేసింది...

అమ్మకు నేనొక్కడ్నే అయివుంటే ఇలా వంతులేసుకునే అవకాశం వుండి వుండేదా? జన్మనిచ్చిన తల్లినీ - తండ్రినీ చివరి దశలో చూడ్డానికి మనిషికెందుకింత స్వార్థం? ఎందుకని అసహ్యం?? ఏదీ అసహ్యమనుకోకుండా భరించి, పాలిచ్చి, లాలించి పెంచి పెద్దచేసిన తల్లికి పట్టెడన్నం పెట్టడానికి పరిస్థితులు సహకరించవా? రేపన్నరోజున నేనూ, నా భార్యా, నా వదిన - యిలా ప్రతి ఒక్కరికీ ఎదురయ్యే సమస్యే కదా యిది. వృద్ధాప్యం మనిషికి నేరమా? వయస్సు మీదపడ్డ వాళ్ల బ్రతుకులే ఘోరమా? - పెద్దన్నయ్య చనిపోగానే ఇంత దూరం నేనెందుకాలోచించలేదు? నాలోని స్వార్థం అమ్మను వంతులేసుకునే వూహకు రూపం కల్పించిందా?... నాలో మంచి చెడుల సంఘర్షణ జరుగుతూ - భరించ శక్యంగాని బాధ మనస్సును చిత్రవధ చేస్తూండగానే భళ్లున తెల్లవారింది.

అప్పుడే అన్నయ్య వచ్చాడు. వీనులవిందైన వార్త తెచ్చాడేమోనని నేను ఎంతో ఆశపడ్డాను - అన్నయ్య పెదవి విరిచాడు. నా ముఖంలోకి చూసి బరువుగా నిట్టూర్చాడు.

జయ యిచ్చిన టీ త్రాగి అమ్మకోసం మళ్లీ అన్వేషణ మొదలు పెట్టాం...

* * *

అమ్మ మాకు కనిపించకుండా పోయి ఆవేళకైదురోజులైంది. ఈ అయిదు రోజులుగా కంటికి నిద్రలేదు; కడుపుకింత తిండిలేదు; మనసుకు శాంతిలేదు... అటు పెద్దన్నయ్యగారి పిల్లలూ - ఇటు నేనూ, అన్నయ్యా, అనంతరావూ - అడిగినచోట అడక్కుండా - వెళ్లిన వూరు వెళ్లకుండా మతులు పోగొట్టుకొని - తిరిగి, తిరిగి అలసిపోయాం. అమ్మ జాడలేదు. మమ్మల్ని కన్నతల్లి కనిపించలేదు.

ఇక అమ్మ కనిపిస్తుందన్న ఆశ నాలో అంత రించిపోతోంది. ఆ మాట తలపుకొస్తేనే ఆనకట్ట తెగిన నదిలా నాలో దుఃఖం పొంగి పొర్లుతోంది. నిజానికి అమ్మ చనిపోయినా ఇంతవ్యథ అనుభవించేవాణ్ణి కాదు - ఈ జీవిత నాటక రంగంలో ఆమె పాత్ర పరిసమాప్తి అయిపోయిందనే తృప్తి అయినా మిగిలి వుండేది. కనీసం ఇప్పుడా తృప్తి కూడా లేదు. అనుక్షణం "అమ్మ ఏమైపోయింది? ఎక్కడుంది?" అన్న జవాబు లేని ప్రశ్నలతో సతమతమైపోతున్నాను. అమ్మ మాకు దూరం కావడానికి కారణమైన వదిన మీద అంతులేని కోపం ముంచుకొస్తోంది... ఈ వృద్ధాప్యంలో, మతిలేని స్థితిలో అమ్మ ఎన్ని బాధలు పడుతుందోనన్న ఆలోచన నా అణువణువునూ దహించి వేస్తోంది. ఆలోచించి ఆలోచించి మొద్దుబారిన మస్తిష్కంతో - ఇక ఆలోచించలేక - ఇంటి వసారాలో వాలుకుర్చీ వేసుకొని, వెనక్కు జారబడి కళ్లు మూసుకున్నాను...

అలా ఎంతసేపు గడిచిందో తెలియదు. ఎవరో పిలిచినట్టై చటుక్కున కళ్లు విప్పాను. ఎదురుగా రాంబాబు మాష్టారు - ఆయన ప్రక్కనే అమ్మ! ఆమెనంత సమీపంగా చూడబట్టి నా తల్లి అని గుర్తించగలిగాను కాని - ఏ మాత్రం దూరంలో వున్నా గుర్తు పట్టలేనంతగా మారిపోయింది ఆమె రూపం... మా వీధిలో ఇంటింటికీ తిరిగి అడుక్కునే ముసలామెకు, అమ్మకు ఏ మాత్రం వ్యత్యాసంలేదు. కుర్చీ లోంచి గభాలున లేచి, ఆనందోద్రేకాలతో అమాంతం అమ్మను కౌగలించుకున్నాను. కానీ, ఆమె నుంచి నేనాశించిన ఫలితం రాలేదు. కళ్లు చిట్లించి క్షణంసేపు నావైపు చూసి - చూపు మరల్చుకొంది అమ్మ.

"అమ్మా! నేనమ్మా మధుని... నీ మధునమ్మా!" అన్నాను ఆవేదనగా.

"అత్తయ్యా... నేను... మీ జయని" అంది అప్పుడే అక్కడకు వచ్చిన జయ - ఆమె వెనుకే వచ్చిన పిల్లలు అనుమానాస్పదంగా అమ్మను చూస్తూ నిలబడిపోయారు.


అమ్మ మా అందరి వైపూ ఓ మారు చూపు సారించింది "ఆc... ఆc" అని క్షణం తర్వాత "మూడు రోజులైందిబాబూ ముద్ద తిని... గుప్పెడు మెతుకులు పెట్టించండి!" అంది... అచ్చం అడుక్కునే మనిషిలా - జాలిగా - దీనంగా.

నా దవడ మీద ఎవరో చాచి కొట్టినట్టయింది. నా గుండెను పిడికిలితో పట్టి లాగినట్టయింది. "చందమామ రావే - జాబిల్లి రావే" అంటూ తన చల్లని చేత్తో గోరుముద్దలు తినిపించి, చిటికెన వ్రేలంత మనిషిని - చెట్టంత వాణ్ణిగా చేసిన నా కన్నతల్లి ఆ చేయి చాచి, ఆ నోరు తెరిచి నన్నే అడుక్కుంటోందంటే - ఇంతకన్నా నికృష్టం మరెక్కడయినా వుంటుందా? ఎంత నిగ్రహించుకున్నా ఆగకుండా నా కళ్లు ధారాపాతంగా నీళ్లను వర్షిస్తున్నాయి.

"మధుమూర్తీ! ముందు ఆమెకు స్నానం చేయించి భోజనం పెట్టండి. ఆమెకు కావాల్సింది ఇప్పుడు మీ పరిచయాలూ, ఆప్యాయతలూ కావు - ఆకలి తీరడం..." అంటున్న రాంబాబు మాష్టారి మాటలు వింటూనే కళ్లు తుడుచుకొని అమ్మను లోపలకు తీసుకెళ్లింది జయ.

"అమ్మ మీకెక్కడ కనిపించింది మాష్టారూ?" అడిగాను, ఆయన వైపు కృతజ్ఞతగా చూస్తూ.

"ఎక్కడోనటయ్యా మధుమూర్తీ! ఆమె మా వీధిలో అడుక్కుంటోంది. ఆవిడ మా గుమ్మం ముందుకొచ్చి 'కాస్త గంజి పోయించండి బాబయ్యా' అని అడిగేవరకూ నేనామెను గుర్తుపట్ట




లేకపోయాను. నువ్వారోజు నాకు చెప్పకపోతే ఆవిడ నీ తల్లి అని నేననుకొని వుండేవాడ్ని కాదు. ఆవిడను గుర్తించిన మరుక్షణం నా మనస్సు ద్రవించిపోయింది" క్షణకాలం ఆగారు మాష్టారు... ఆయన కళ్లు సజలపూరితాలవడం నేను గమనించాను. సూటిగా ఆయన మొహం లోకి చూడలేక తల దించుకున్నాను.

"ఇలాంటివన్నీ చూస్తూంటే మనిషికి వృద్ధాప్యం భయంకరమైనదేమోననిపిస్తూందయ్యా మధుమూర్తీ! అడుక్కునే కొందరి జీవితాల్ని తరచి చూస్తే ఇంతకన్నా హృదయ విదారకమైన విషయాలెన్నో బయటపడతాయి. ఏదిఏమైనా మధుమూర్తీ! ఇలా మరోసారి జరక్కుండా చూసుకోండి. చెబితే మీకు కోపం రావచ్చునేమోగాని - వయస్సు పైబడ్డవాళ్లను ఈ భూమ్మీద అప్పుడే కళ్లు తెరిచిన పసిపాపల్లా చూసుకోవాలి... వృద్ధాప్యం మనిషికి నేరం కాదయ్యా! అది బ్రతికే ప్రతి మనిషికీ తప్పనిదీ - తప్పించుకోలేనిదీను. నా మాటలు అర్థంచేసుకో మధుమూర్తీ! నేను మళ్లీ వస్తాను" అని రాంబాబు మాస్టారు వెళ్లిపోయారు.

మాస్టారి మాటలు వాడి బాణాల్లా నా గుండెల్లోకి దిగాయి. కళ్లముందు మెరుపులు మెరిశాయి - ఇక అమ్మను ఎక్కడికీ పంపకూడదన్న నిర్ణయం ఆ క్షణాన తీసుకున్నాను. నన్ను కట్టుకున్నప్పట్నుంచీ కష్టాలను చిరునవ్వుతో భరిస్తున్న జయ - నా నిర్ణయానికి హర్షం వెలిబుచ్చుతుందనే గాఢనమ్మకం నాకుంది... మనసుకు దెబ్బ తగిలితేనేకాని కొన్ని మంచి నిర్ణయాలు తీసుకునే బుద్ధి మనిషికేర్పడదేమో...?

ఓ వారం రోజుల తర్వాత "జయా! 'ఓ తల్లి కథ' సినిమాకు వెళదాం పద" అన్నాను. "ఒద్దండీ, ఆ సినిమా నేనిక చూడను!" అంది జయ. ఆ తల్లి కథ కూడా నా తల్లి కథలాగే వుంటుందనుకుంటోందో - తనకు రాబోయే వృద్ధాప్యాన్ని తల్చుకొని భయపడుతోందో నాకు అర్థంకాలేదు.